ఇంకా సంజీవరెడ్డి, హిందూపురంలో కాంగ్రెసు అభ్యర్థి (నందికొండా పందికొండా? అని నందికొండ కావాలనే తోటి ఆంధ్రుల అవహేళన చేసిన) శ్రీ కల్లూరి సుబ్బారావుగారి అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ, పైప్రసంగంలాంటి అసందర్భపు ప్రసంగమే చేసారు.

ఇక శ్రీ యస్. కె. పాటిల్. శ్రీకాకుళం జిల్లా 'రాజాం' సభలో ప్రసంగిస్తూ "ప్రజాసోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టు పార్టీలవంటి కుక్కగొడుగు పార్టీలకు స్థానంలేకుండా చేయాలని" అన్నారు. నాకు తెలిసినంతవరకూ, "కుక్కగొడుగు" అనేది ఎక్కువకాలం మననిదని. కాని శ్రీ పాటిల్ నుడివిన రెండు పార్టీలు చాలాకాలంగా దేశంలో వుంటూనే వున్నై. గత ఎన్నికల్లో కాంగ్రెసు పార్టీలో చీలిపోయిన వ్యక్తులు తలకొక పార్టీ పెట్టి పోటీలో పాల్గొన్నా, సోషలిస్టుపార్టీకి ద్వితీయస్థానం లభించింది. అంటే ప్రజలు కాంగ్రెసు తరువాత సోషలిస్టుపార్టీని అభిమానిస్తున్నారన్నమాట. ఈనాడు సోషలిస్టు పార్టీని హేళనచేస్తున్న నాయకులు అసంఖ్యాకంగా, ఆ పార్టీని అభిమానించిన ప్రజలపై "సవాలు" చేస్తున్నారన్నమాట. మన రాష్ట్రానికి సంబంధించినంతవరకు, లోక్, ప్రజాపార్టీలు మాత్రమే, కుక్కగొడుగు పార్టీలుగా ప్రజలు అభివర్ణిస్తుంటారు. తన రాష్ట్రంలో తన పలుకుబడికి అడ్డంవచ్చినారని అవకాశం దొరికింది గదా అని ఈనాడు ప్రజాసోషలిస్టు పార్టీని, తమ సంకుచిత భావాలకు సరిపోయినట్లుగా చిత్రించుకొని ప్రచారం చేయడం సమర్థనీయంకాదు. అదీగాక, దేశంలో ప్రజాపాలనా భారం తమ ఒక్కరి భుజస్కంధాలపైనే వుందని, మరోపార్టీకి అలాంటి అవకాశం లేదనే ప్రచారం ఏకపక్ష నియంతృత్వ పోకడలకు దారి తీయవచ్చు. ఆ దృష్ట్యా చూస్తే పాలక పార్టీని అదుపులో పెట్టగల మరో ప్రజాస్వామిక పక్షం ఆవశ్యకత ఎంతైనావుంది. అలాటి యుక్తాయుక్త విచక్షణగల్గి, ప్రభుత్వాన్ని సరైన మార్గంలో నడిపింపగల దేశంలో ఒక్క ప్రజాసోషలిస్టు పార్టీయే కలిగివున్నట్లు కనిపిస్తుంది. వ్యక్తిగతంగానూ, ప్రాంతీయంగానూ, రాజకీయంగానూవున్న అభిప్రాయభేదాలు ఆధారంగా తీసుకొని, మరో పార్టీలోగల మంచి పరిగణింపక తాత్కాలికంగా స్వప్రయోజన సిద్ధిస్తుంది గదా అనే వాంఛతో దూరాలోచనలేక చిత్తంవచ్చినట్లు ప్రచారాలు చేస్తే భవిష్యత్తులో అవెలాంటి అవాంఛనీయ పరిస్థితులకైనా దోహద మివ్వవచ్చు. "నిజాన్ని నిజంగా చెప్పడమే బుద్ధిమంతుల లక్షణం."

కథానిక

# నోరు లేని వాళ్లు

## రంధి సోమరాజు

అది మన ఆంధ్రరాష్ట్రంలోని ఒక పట్టణం.

ఇద్దరు మిత్రులు ఆ పట్టణంలోని బజారులో ఓ కొట్టుమీద కూర్చున్నారు. వారిలోసుబ్బారావు ఆ కొట్టులో పనిచేస్తున్నాడు. రెండవ అతను నరహరి.

సుబ్బారావు కొంచెం నీరసంగా ఉన్నాడు. అతని కళ్ళలో ఏదో దుఃఖం ఉస్సు రంటూంది. నరహరి మొగం ఎంతో కలకల్లాడుతూంది. అతని నవ్వు అతని మాటల కనుగుణంగా నాట్యం చేస్తూంది.

నరహరి పకపకానవ్వి, 'ఏరాః...మీ మునిసిపాలిటీ నిద్దరోతోందా ఏం? అబ్బబ్బ! ఏమిటీకంపు!' అన్నాడు.

సుబ్బారావుకు కోపంవచ్చింది. దానితో అతను, "మీ మునిసిపాలిటీ ఇంతకన్నా ఊడబొడిచెయ్యలేదులే' అన్నాడు. ఈ మాటలన్నప్పుడు, అతని కంఠం చాల కరకుగా ఉంది. "ఈ విషయంలో వాదనకు దిగావంటే—నిన్ను తుక్కుతుక్కు కింద ఓడించేస్తాను, జాగ్రత్త!" అన్నట్టుగా ఉంది.

సుబ్బారావంతటి వాదనాపటిమ లేని నరహరి, వాదనలో సుబ్బారావుతో నెగ్గగలనన్న గుండె నిబ్బరంలేని నరహరి వెంటనే తగ్గిపోయాడు.

నిజానికి నరహరి ఉంటూన్న ఊరే బాగుంటుంది. కాని నరహరికి ఆ విషయాన్ని ఋజువుచేసే సత్తా లేదు. నోరులేని వాడికి, తెలివిలేని వాడికి ఓటమి మరి తప్పదన్నట్లుగా నరహరి మెత్తబడిపోయి, "అప్పుడే అంత కోపమొచ్చేసిందిరా...ఓరి..నీ.." అన్నాడు.

సుబ్బారావు వెంటనే "లేకపోతే మీవూరు మహా..." అని ఆగిపోయాడు.

పాపం నరహరి ఏదో అనాలి కాబట్టి "అంత కుళ్ళిపోతావేరా...సుబ్బీ... మన ఆంధ్రలో ఏ పట్నం చూసినా ఇలాగే వుందిలే" అన్నాడు.

ఈ మాటలకు సుబ్బారావు తృప్తిపడ్డాడు. దానితో అతను "ఆ...అలాదిగిరా" అన్నాడు. అలా నరహరి దిగజారిపోవడం తనకెంతో ఇష్టమైనట్లు.

ఆంధ్రదేశంలోని పట్టణాలన్నీ కుళ్ళుకంపుకు నిలయాలేకాబట్టి, అలాకాకుండా మిగిలిపోయే పట్నానికి, అదెంతో సిగ్గుచేటైన విషయమైనట్లు ఆ యిద్దరు మిత్రులూ ఆ విషయాన్ని అంతటితో సాగదియ్యకుండా గప్‌చిప్‌గా ఊరుకున్నారు.

అవి దసరాపండుగ రోజులు. ఆ నాడు బజారులో జనం విరివిగా తిరుగుతున్నారు. అయితే ఆ జనంలో కొట్టుమీదకు వచ్చి సరుకులు కొనుక్కునేవాళ్ళు చాలతక్కువగా ఉన్నారు. కాని ముష్టివాళ్ళుమాత్రం కొట్లవద్దకు వచ్చి డబ్బులడుక్కోవడం చాల ఎక్కువగా ఉంది.

అప్పుడే సుబ్బారావు ఉన్న కొట్టుముందుకొక బిచ్చగాడు వచ్చాడు. సుబ్బారావు అతని మొగంలోకి అలాగే చూశాడు.

ఆ బిచ్చగాడు చాచినచేయి చాచినట్లుగానే ఉంది. అతని ఆకలికన్నులు ఏదో అడుగుతున్నట్లుగానే ఉన్నాయి, ఊచల్లాంటి అతనికాళ్లు నేల మీద నిలబడటమే లేదు. ఎక్స్‌రే ఫోటోలో ఉన్న బొమికల గుండెలా, అతనిగుండె—గుండెల్ని కదుపుతూంది.

ఆ బిచ్చగాడు 'బాబూ' అనలేదు. గడ్డిపోచ వంటి అతనిచేయిమాత్రం వణికింది. వణికినచేయి కొద్దిగా వంగింది అంతే.

పాపం సుబ్బారావుగుండె కదిలింది. 'అబ్బ ఎంత దీనంగా ఉన్నాడు' అన్నాడు జాలిగా. మెల్లగా 'వెళ్ళు అబ్బీ...' అని చేయి ఊపాడు.

ఆ యబ్బి తిరిగి బిచ్చమడుగలేదు. సుబ్బారావు జాలిగుండెవైపు తిరిగి చూడలేదు. అంతే... అలాగే కదలిపోయాడు.

సుబ్బారావు జాలిగుండె అప్పుడు మరింత బాధపడింది. కాస్సేపు ఆయబ్బి నిలబడి మరొక్కసారి అడిగిఉంటే-ఒక్కకానీ వేసివుండేదాన్నే మో అనుకుంది అతనిగుండె.

పాపం సుబ్బారావు మనస్సు చివుక్కుమంది.

నరహరికి విసుగెక్కువై "ఏమిటోయ్ ఈ బిక్షకులగోల! కట్టిపారెయ్యగూడదూ వెధవకొట్టు. పండుగపూట కూడ ఏమిటీ కొలువు? నెలవిచ్చినా పుచ్చుకోలేనివాళ్ళను చూస్తే నాకు చెడ్డ మండుతుంది" అన్నాడు.

సుబ్బారావు నరహరివైపు అదోలా తేరిపార చూశాడు. చూసి, "చూశావురా ఆ యబ్బి! ఎంత దీనంగా ఉన్నాడో...ఒక్కకానీ కూడ వెయ్యలేకపోయాను. ఏమిటో నాకు తెలియకుండానే పొమ్మన్నాను" అన్నాడు.

నరహరి సుబ్బారావుబాధ గమనించకుండా "సరేలే, ఇంక కట్టేద్దూ...అలాపోదాం" అంటూ ఒళ్ళువిరిచి, ఆవులించి చిటికె వేశాడు.

సుబ్బారావు "వెళ్ళిపోదాంరా... ఇంకొక్క అరగంట...పోష్టురాగానే పోదాం" అన్నాడు.

"వెధవ ఉత్తరాలు, రోజూ ఉండేవేగా... పోదాం రద్దూ...సాయంకాలంవచ్చి చూచుకోవొచ్చు" అంటూనరహరి అక్కడ ఇంకాస్సేపు కూడ కూర్చొని ఉండలేనట్లు, కుర్చీలోంచి పైకిలేచాడు.

సుబ్బారావు, ఏదో చెప్పనా మాననాఅన్నట్లు తటపటాయిస్తూ, "ఉండరా ఇవ్వాళ మనకో ఉత్తరం రావాలి. అది చూడకుండా ఇంటికిపోతే ఇక చచ్చేనన్నమాటే. ఈ మనసు చెప్పేమాట మనం ఏమాత్రం వినకపోయినా అది మనల్ని తన ఇష్టంవచ్చినట్లు ఖూనీ చేసేస్తుంది." అన్నాడు. ఇలా అన్నప్పుడు అతని పెదవులు కొద్దిగా నవ్వాయి. ఆ నవ్వుచూసి, నరహరి ముచ్చటపడ్డాడు. అదోలా ఉన్న సుబ్బారావు నవ్వగానే నరహరికి ఆ కొట్టులో ఇంకొంచెంసేపు కూర్చోవాలనిపించింది.

అత్తవారింటికి వచ్చిన నరహరికి ఆ వూళ్ళో సుబ్బారావును మినహాయిస్తే మరి స్నేహితులు లేరనే చెప్పవచ్చు. ఇద్దరూ ఒకే వూళ్ళో బి. ఏ. వరకూ చదువుతున్నారు. చదువు అయిన తరువాత వాళ్ళు ఉద్యోగాలకై ఎక్కడెక్కడికో పోవలసి వచ్చింది.

"అయితే ఆ ఉత్తరం అంత ముఖ్యమా? ఏం?" అంటూ నరహరి, ఆ సంగతేమిటో తెలుసుకోవాలనే ఉత్సాహంతో సుబ్బారావు కళ్ళల్లో కళ్ళు పెట్టాడు.

ఇంతలోనే సుబ్బారావు మనసులో ఏం కల్లోలం జరిగిందో మరి, అతని మొగం నల్లగా మాడి పోయింది. సుబ్బారావు ఒక పట్టాన ఆ విషయం చెప్పలేక పోయాడు. "అ అఁ ఏమీలేదు." అన్నాడు నీరసంగా.

"నాకు చెప్పగూడని రహస్యమా?" అంటూ నరహరి, సుబ్బారావును బలవంతం చేయ బోయాడు. కాని సుబ్బారావు, అదేమిటో చెప్ప కుండా ఉండేందుకే నిశ్చయించుకున్నట్లు ఒకసారి రోడ్డుమీదికి దృష్టి సారించాడు.

ఆ రోడ్డు అంతా అతని మనసులాగే గజిబిజిగా ఉంది. దానిమీద రిక్షాలు సైకిళ్ళు తెగతిరుగు తున్నాయి. ఉండి ఉండి కార్లు దుమ్మును లేపు కుంటూ పోతున్నాయి. అవన్నీ తమతమ కంఠాలను విప్పి అఱచుకుంటూ త్రోవతీస్తున్నాయి. అవి ఎంత గట్టిగా అరుస్తూఉంటే వాటిముందు త్రోవ అంత సులువుగా ఏర్పడుతూంది. గోలచెయ్యక పోతే మాత్రం దారి దొరకడం మాత్రం కష్టమనేది బుజువౌతుంది. అబ్బబ్బ! అంతా హడావుడి! అటునుంచి మనుష్యులు. ఇటునుండి మనుష్యులు వారికీ వీరికీ మధ్య అనేక రకాల వాహనాలు. అంతా, ఆ బాటమీద తమ వాటాకోసం పోటి పడుతున్నట్లుగా ఉంది. త్రోసుక పోయేవాళ్ళదే రాజ్యమైనట్లు, కార్లూ, సైకిళ్ళూ అరపులతో హడలెత్తించి, ముందుకు దూసుకపోతున్నాయి. ఆ హడావుడి రోడ్లజంక్షన్‌మీద అమాయకుల పాట్లు చెప్పతరం కాకుండా ఉన్నాయి.

నరహరికి, సుబ్బారావు దాస్తూన్న ఆ రహస్య మేమిటో, మరి ఆ ఉత్తరంలోని సంగతు లేమిటో బోధపడలేదు. మళ్ళీమళ్ళీ ఆ విషయమే అడిగి అతన్ని విసిగించడం అతని కొట్టే ఇష్టమూకాలేదు. అంచాత ఊరికనే ఉండలేక, "ఏం సినిమా లాడు తున్నాయిరా ఇక్కడ" అని, సుబ్బారావును తన మాటల్లోకి మళ్ళించడానికి ప్రయత్నించబోయాడు.

అయితే సుబ్బారావు సినిమాల సంగతేమీ చెప్పలేదు. కాని, "ఏరాఁ నరహరీ... మావూరు రమ్మని నన్ను ఒక్కసారీ ఆహ్వానించావుకాదేం!" ఎదురు ప్రశ్న వేశాడు.

దీనితో నరహరి, తననవ్వును, సిగరెట్టు ముట్టించడానికి 'చక్' మనిపించి వెలిగించిన స్పిరిట్ దీపపు కాంతిలా ప్రసరింపజేసి, "నువ్వెందుకొస్తావులే మావూరు" అంటూ దాన్ని 'ఉఫ్'న ఊదేశాడు.

సుబ్బారావు అతితాపీగా "మనకు ప్రమోషన్ వచ్చిందంటే ఇక మీవూరే గతోయ్" అన్నాడు. అప్పుడాతని కళ్ళల్లో నవ్వు కుదించబడి ఉంది. అతని మనస్సు అప్పుడే ఈ సంగతి బయటకెందుకు చెప్పేశావ్ అంటూ తెగనలిగి పోయింది. వెంటనే నరహరి "ఓరి...నీఁ...ఇంకా చెప్పవేం... ఐతే ఇవాళ గ్రాండ్ డిన్నర్ పార్టీ ఉన్నదన్నమాట! అలాగచెప్పు, ఉత్తరమంటే ఏమిటో అనుకున్నాను. ఇదా సంగతి!" అన్నాడు తనకళ్ళల్లోని ఆనందాన్ని పైస్థాయిలోకి ప్రమోట్ చేస్తూ.

"సంగతి అదేకాని, అది మనచేతిలోకి వచ్చి పడ్డప్పుడుకదా..." అన్నాడు సుబ్బారావు సాలోచనగా.

"నీకురాక ఇంకెవ్వడి కొస్తుందోయ్. బోలెడంత అనుభవముంది; అందరికన్నా ముందు చేరినవాడివి. నీకుకాకపోతే ఇంకెవ్వడికి? నువ్వుకాబట్టి ఇంత జాగ్రత్తగా ఈ విషయాన్ని దాచగలిగావు కాని, నేనైతేనా ఈపాటికి ఊరు ఊరంతా టాంటాం చేసి పారేద్దును" అంటూ నరహరి హుషారుగా నవ్వాడు.

"టాంటాం చెయ్యాలని నాకూ ఉంది. ఐతే అది నాకేవస్తుందని ఖచ్చితంగా తేలాలిగదా..." అన్నాడు సుబ్బారావు.

"ఏం?...ఇంకా ఈ విషయంలో అనుమానముందా...అయితే మీ మేనేజర్ను ఒకసారి చూడలేక పోయావా..." అనకుండా ఉండలేక పోయాడు నరహరి.

"మరీ అంత కలుసుకోవలసిన అవసరం లేదులే. ఆయన చాల మంచివాడు. నా సంగతి ఆయనకు బాగా తెలుసు. నీకోకసారి చెప్పానుగా ఆయనకు నామీదఉన్న అభిప్రాయాన్ని."

"అయితే ఇంకనుమాన మెందుకోయ్‌పిచ్చోడా. అదుగో పోస్టు జవాను. ఏ అబ్బాయ్ ఆ ఉత్తరాలు ఇలాగియ్" అంటూ నరహరి అతని దగ్గరనుంచి ఆ ఉత్తరాలు లాక్కోబోయాడు. కాని ఆ వచ్చిన ఉత్తరాల్లో తమ ఆఫీసు ఉత్తరాన్ని గబాలున సుబ్బారావు లాక్కున్నాడు. ఈ లాక్కోవడం పీక్కోవడాల్లో ఆ ఉత్తరం పూర్తిగా నలిగిపోయింది. పాపమా ఉత్తరం "చంపేసేముందు నన్నెందుకిలా చిత్తుగా చిదుగబోడుస్తారు? నా ప్రాణాల్ని, మీకు పుణ్యముంటుంది ఒకసారే వేగంగా తీసెయ్యండి" అని ఏడ్చింది.

అప్పుడే వీధిలో ఆ కొట్టుముందుకు అడవి మృగాల అరుపుల్ని అసహ్యంగా అనుకరిస్తూ పిచ్చిగా అరుస్తూ చిందులు త్రొక్కుతూ, చేతిలోని తుప్పుపట్టిన కిరసనాయిలుడబ్బా డబడబ వాయిస్తూ ఓ దసరా బిచ్చగాడు వచ్చి నిలబడ్డాడు. ఇద్దరు మిత్రులూ అటువైపు చూశారు. వాడు దుక్కలా ఉన్నాడు.

ఆ బిచ్చగాడు వంటినిండా మసి పులుముకొని, దానిమీద అక్కడక్కడ సుద్దబొట్లు పెట్టుకున్నాడు. ముక్కలు ముక్కలుగా అయిన ఎగుడు దిగుడు పైభాగంగల గుండ్రపాటి కుండ అంచును కిరీటంగా పెట్టుకున్నాడు. వికారంగా అరుస్తూ, మసిపూత మొగంలో తెల్లచుక్కల నడుమ, కానులకోసం చికిలిస్తూ డబ్బా అదేపనిగా దబదబ తెగవాయిస్తున్నాడు; చెవులు దిబ్బళ్ళు పడిపోయేట్టు!

వెంటనే సుబ్బారావు "ఉండరా ... వీడిని పంపించేసి మనం స్థిమితంగా ఉత్తరం చదువుకుందాం" అంటూ ఆ బిచ్చగాడికి ఓ కానీ పడేశాడు. వాడు విజయాన్ని సాధించినట్లు డబ్బా మ్రోగించుకుంటూ ముందుకుసాగిపోయాడు.

సుబ్బారావు అతి తాపీగా ఆఉత్తరం పీక కత్తిరించాడు. ఆ కత్తిరింపులో అది అణువణువునా పోతూన్న తన ప్రాణంకోసం హృదయ విదారకంగా విలపించింది.

సుబ్బారావు జాగ్రత్తగా జాబు విప్పాడు. అంతే...పాపం! అతను అందులో ఉన్న విశేషాన్ని నరహరికి ఏమీ చెప్పలేకపోయాడు.

"ఏరా, ఏమిటి?"అన్నాడు నరహరి.

సుబ్బారావు మొఖం వికృతంగా మారిపోయింది. ఒక్కసారిగాఅతను,"నన్ను ఖూనీచేశార్రా మెత్తగా ఉండి ఎంత పనిచేశాడు ఆ మేనేజరు. ఇంత పని చేస్తాడని నేను కలలో కూడ అనుకోలేదు. నన్ను ఎంతో పొగడితే అదంతా నిజమే అనుకున్నాను. ఎంత మోసపోయాను! ఇంత విషంలోపల ఉంచుకొని, పైకి అంత తియ్యగా మాట్లాడుతాడని నే నెప్పుడూ అనుకోలేదు. ఎందుకూ పనికిరాని, చేతగాని ఆ శేషగిరి గాడికి ఆ ఉద్యోగం ఇస్తాడని నేను ఊహించలేక పోయాను. ఎంత అన్యాయం చేశాడు!" అన్నాడు ఎంతో బాధతో.

వెంటనే నరహరి, "ఏమటీ...శేషగిరిగాడికా ఇస్తా...వాడ్ని నేను బాగా ఎరుగుదును. వాడ్నీ, వాడిడబ్బా వాగుడ్నీచూస్తే నాకు చెడ్డ అసహ్యం వేస్తుంది. మీ మేనేజరుకు అదేం పోయేకాలం? ఇంత అన్యాయం ఎందుకు చేశాడు? అయినా నువ్వు మరీ మెత్తనలేరా అతనితో ఈ విషయమ్మై ఒకసారి నువ్వు గట్టిగా చెప్పిఉంటే ఎంత బాగుండేది! వాడేదో వాడ్ని మభ్యపెట్టి ఉంటాడు. వాడు ఎన్ని వేషాలైనావేసి అనుకున్నదాన్ని సాధించే రకం! మంచితనమూ సమర్థతా ఈ రోజుల్లో ఎవడు చూస్తాడు? ఆశ్రయించే వాళ్ళకీ ఇరకాటాన పెట్టి,మొహమాట పెట్టి నానాఅవస్థలూ పెట్టేవాళ్ళకే, అన్ని సదుపాయాలూను. అన్నట్టు, చూడు——ఇందాక, నువ్వు మనల్ని ఏమీ ఇబ్బంది పెట్టని, ఆ బిచ్చగాణ్ణిచూసి ఎంతో జాలిపడినా, ఒక కానీ వెయ్యలేకపోయావు నిజంగా వాడికి కానీకాదు కదా ఎంతైనా ఇవ్వొచ్చు! గోలగా మన పనులకడ్డం వస్తున్నాడని, ఆ డబ్బా మోతగాడికి ఓ కానీ ఇచ్చి,వాడ్ని నిముషాలమీద పంపించేశావు.ఇదిగోఇలాగేఉంటుంది లోకం"అన్నాడు.

"ఏమిటిరా అన్నావు" అంటూ సుబ్బారావు ఎంతో బాధతో నరహరి మొహంలోకి చూశాడు.

పాపం నరహరి, సుబ్బారావు బాధను పంచుకుంటూ, "అంతేరా మెత్తగా ఉండేవాళ్ళపని ఉత్తదే!" అన్నాడు.

★